8.6.2000

# కార్పొరేట్ సేద్యానికేనా జల 'సంరక్షణ'?

**నీళ్లంటే భూగర్భ జలాలు మాత్రమే కాదు. ఉపరితల జలాలుకూడా. నీటితో మనిషికి స్నేహసంబంధమున్న రోజులలో రెండింటినీ సమతూకంగా వాడుకున్న సమర్థమైన సాగునీటి వ్యవస్థ ఉంది. ఇప్పుడు అకస్మాత్తుగా నీళ్లంటే భూమిలోపలివే ఎందుకయ్యాయి?**

**నీటిని వినియోగంకోసం భద్రపరచడమంటే భూగర్భ జలాశయాలలో భద్రపరచడమే ఎందుకయింది?**



కె.బాలగోపాల్

మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి కొన్ని ప్రాథమిక సత్యాలు కూడా చెప్పవలసి వస్తున్నది.

నీళ్లంటే ఆయన భూగర్భ జలాలేనని ఎందుకు అనుకుంటున్నారు? నీటిని జాగ్రత్త చేయడమంటే భూమిలోకి పంపించడమేనని ఎందుకు అనుకుంటున్నారు? చెరువంటే ఊటచెరువేనని ఎందుకనుకుంటున్నారు? నీళ్లు ఏ కొంచెం ఆవిరైనా ఏ కొంచెం సముద్రంలోకి పోయినా అది 'వృథా'యేనని ఎందుకు అనుకుంటున్నారు?

కురిసిన వర్షం కొంత నేలలోనికి ఇంకుతుంది. కొంత నేలమీద మట్టిలో నిలుస్తుంది. కొంత ఆవిరి అవుతుంది. కొంత సముద్రంలో కలుస్తుంది. సముద్రంలో కలిసినది మళ్లీ ఆవిరి అవుతుంది. ఆవిరి అయినది గాలిలో తేమ అవుతుంది. తిరిగి వర్షమవుతుంది. భూమిలోకి ఇంకినది తిరిగి నేలపైకి (మానవ పరిశ్రమ ఫలితంగా) వచ్చి నేలమీది మట్టిని తడుపుతుంది. మొక్కలకూ, మనుషులకూ ప్రాణం పోస్తుంది. తిరిగి మట్టినుండి, మొక్కలనుండి, మనుషుల ఒంటిమీది స్వేదబిందువులనుండి ఆవిరి అవుతుంది. మళ్లీ వర్షమవుతుంది.

ఇదొక 'సైకిల్'. దీనిని ఎక్కడో ఒక చోట తెంపేస్తే ఏమవుతుందో చెప్పడం కష్టం. ప్రపంచంలోని మనుషులంతా ఒక్క మనసుతో ప్రతీవర్షం నీటిచుక్కనూ నేలలోకి తొక్కేసి ఆవిరికాకుండా, సముద్రంలో కలవకుండా చేసేస్తే సముద్రాలేమవుతాయో, చేపల వంటి సముద్ర జీవులేమవుతాయో, గాలిలో తేమ తగ్గిపోయి ఋతుపవనాలేమవుతాయో చెప్పడం అంత సులభం కాదు. మానవ మనుగడపైన దాని ప్రభావం ఎలా ఉంటుందో కూడా చెప్పడం కష్టం.

భగ్నమయిన వాతావరణ సమతుల్యాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో భాగంగా వాటర్‌షెడ్లకు సంబంధించిన ఆలోచన పుట్టింది. వ్యవసాయాన్ని ప్రకృతిపైన దాడిగా భావించే కార్పొరేట్ పెట్టుబడిదారీ దృక్పథానికి దానిని అనుసంధానం చేయాలని చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారు. వాటర్‌షెడ్ల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలనీ, ఒక్క చుక్కనీరు కూడా ఆవిరికాకుండా, సముద్రంలోకి పోకుండా భూగర్భ జలాశయంలోకి పోవాలనీ ఒక పక్క అంటారు. అదే సమయంలో పాశ్చాత్య అగ్రోబిజినెస్ కంపెనీలను రాష్ట్రంలోకి ఆహ్వానించి, వారి ఎగుమతి దిగుమతి వ్యాపారానికి రాష్ట్ర వ్యవసాయరంగాన్ని కార్యక్షేత్రంగా మలచే వ్యవసాయవిధానాన్ని ప్రకటిస్తాడు. ఆ ఆగ్రోబిజినెస్ కంపెనీలు ఏం చేస్తాయి? విపరీతంగా నీళ్లుతాగే కొత్త వంగడాలను విస్తారంగా పండించి, లేదా రైతుల చేత పండింపజేసి ఎగుమతి చేస్తాయి. ఇప్పుడు రాష్ట్రంలోని కరవు ప్రాంతాలలో 300 అడుగుల లోతుకు (రాయలసీమలో కొన్నిచోట్ల 500 అడుగులదాకా) బోర్లు వేయిస్తున్నారు. చంద్రబాబు ఆహ్వానిస్తున్న కార్పొరేషన్లు ఇంకొక 100, 200, 300 అడుగుల లోతుకు బోర్లువేసి అయిదేళ్లు కష్టపడి కాపాడిన వాటర్‌షెడ్ ఫలితాన్ని ఒక కారు పంటకోసం పీల్చేయగలవు.

అప్పుడేం చేయాలంటే ఇంకా ఇంకా చెట్లు పెంచాలి. ఎక్కడ ఖాళీజాగా దొరికితే అక్కడ చెట్లు పెంచి వర్షం ఇంకా బాగా పడేటట్లు చూడాలి. అలా పడిన వర్షమంతా భూగర్భ జలాశయంలోకి పోయేటట్టు చూడాలి. మళ్లీ లోతుగా బోర్లువేసి ఆ నీటి నంతటినీ ఒక రివర్స్ జలపాతంలాగా పైకి లాగేసి విపరీతంగా నీళ్లుతాగే ఎగుమతి బ్రాండు వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టి కార్పొరేషన్ల ద్వారా ఎగుమతి చేసి....

ఇది ఆధునీకరణ ఉన్మాదం. ఆధునీకరణ వల్ల దెబ్బతిన్న పర్యావరణాన్ని, నేలకింద ఉన్న నీటి వనరులనూ నేల మీద మట్టినీ, చెట్లనూ కాపాడి ప్రకృతికీ మనిషికీ స్నేహసంబంధాన్ని పునరుద్ధరించడం కోసం పుట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని —అందులో భాగమైన జలసంరక్షణ ఉద్యమాన్ని —అదే ఉన్మాదానికి తలపెట్టే వ్యవసాయ విధానం చంద్రబాబుది.

నీళ్లంటే భూగర్భ జలాలు మాత్రమే కాదు. ఉపరితల జలాలుకూడా. నీటితో మనిషికి స్నేహసంబంధమున్న రోజులలో రెండింటినీ సమతూకంగా వాడుకున్న సమర్థమైన సాగునీటి వ్యవస్థ ఉంది. తెలంగాణాలోనో, రాయలసీమలోనో చక్కటి చెరువుల వ్యవస్థ ఉండేది. చెరువులు ఇప్పటికీ ఉన్నాయిగానీ అవి చాలావరకు శిథిలమయి ఉన్నాయి. ఉన్నమేరకు 'వ్యవస్థ'గా లేవు. ఒక చెరువు అలుగు పారితే మరి రెండు చెరువులోనికీ వాటి అలుగులు పారితే ఇంకొక మూడు చెరువులలోనికీ నీరు చేరే వ్యవస్థ ఉండేది. ఇప్పుడు చెరువులన్నీ పూడిపోయి క్రికెట్ మైదానాలలాగా ఉన్నాయి. కట్టలు పాడయి, నిలిచిన కొద్ది నీరు అలుగు మీదనుండే కాక కట్టకింది నుండి కూడా పలుదిక్కుల ప్రవహిస్తున్నాయి. అలుగు పారిన నీటిని కింది చెరువులోకి చేర్చే కాలువలు పాడవడం వల్ల నీరు అస్తవ్యస్తంగా ప్రవహించి కింది చెరువులలోకి చేరడంలేదు.

యాభైఏళ్లుగా ఈ చెరువుల గురించి పట్టించుకున్న ప్రభుత్వం లేదు. కానీ జలసంరక్షణ గురించి ఇంత పెద్దఎత్తున ఇప్పుడు ప్రచారం జరుగుతున్నది కదా —ఇప్పుడయినా చెరువుల వ్యవస్థను బాగుచేసే ఆలోచన చేయొచ్చుకదా? పూర్వపు స్థాయికి వాటిని తీసుకువచ్చినట్లయితే కురిసిన వర్షం ప్రతీచుక్కా కాకపోయినా చాలాభాగం చెరువులలో నిలుస్తుంది. భూగర్భ జలాల ఊట పెంచడానికీ పనికొస్తుంది. తూముల ద్వారా పారించుకుని పంటలు పండించుకోవడానికీ పనికొస్తుంది.

చెరువు నీళ్లందని ప్రాంతాలుంటాయి. చెరువులే లేని గ్రామాలు కూడా ఉంటాయి. వాటికి బావినీళ్లే శరణ్యం కాబట్టి బావులలో ఊటపెంచే జలసంరక్షణ విధానాలు అక్కడ అవలంబించవచ్చు. శతాబ్దాలుగా చెరువులు, బావుల (ఉపరితల, భూగర్భ జలాల) సమన్వయం ద్వారానే వ్యవసాయం నడిచింది తెలంగాణా, రాయలసీమలలో. ఇప్పుడు అకస్మాత్తుగా నీళ్లంటే భూమిలోపలివే ఎందుకయ్యాయి? నీటిని వినియోగంకోసం భద్రపరచడమంటే భూగర్భ జలాశయాలలో భద్రపరచడమే ఎందుకయింది?

చెరువుల కింద అగ్రోబిజినెస్ కార్పొరేషన్లు వ్యవసాయ వ్యాపారం చేపట్టడం కష్టం. కొన్ని వందల ఎకరాలు లీజుకు తీసుకుని (దీనికోసం భూమి గరిష్ఠ పరిమితి చట్టాలను సవరించాలన్నది చంద్రబాబు వ్యవసాయ విధానంలోని ఒక ముఖ్యప్రతిపాదన) ఎరువులు సమృద్ధిగా వేసి నీళ్లు సమృద్ధిగా పారించుకుని విదేశాలలో బాగా అమ్ముడుపోయే మేలురకం వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టడం చెరువుల కింది వ్యవసాయంలో సాధ్యంకాదు. కావలసినన్ని చోట్ల వేసుకుని భూగర్భ జలాలను పెద్దమొత్తంలో పీల్చుకుంటేనే సాధ్యం అవుతుంది. దానికి కాకతీయులు, రాయలకాలం నాటి 'చెరువుల వ్యవస్థ' అక్కరలేదు. చెరువులన్నీ ఊటచెరువులుగా మారిపోవాలి. బోర్లకు నీళ్లు అందించాలి. వాగులు, వంకలు చెరువులలోకి నీళ్లు చేరవేయనక్కరలేదు. నేలలోకి చేరవేయాలి. బోర్లకు అందివ్వాలి.

చెరువుల వ్యవస్థను లెక్కలోకి తీసుకోకుండా వాటర్‌షెడ్లకోసం చెక్‌డ్యాంలు కట్టడం వల్ల ఇప్పటికే సగం ఎండిపోయిన చెరువులు పూర్తిగా ఎండిపోతున్నాయన్న ఫిర్యాదు ఇప్పటికే వినవస్తున్నది. మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ దగ్గర కేసరిసముద్రం అనే చెరువు ఉంది. అది అయిదు చెరువుల వ్యవస్థలో ఒకటి. విపరీతమైన పూడిక వల్ల, కట్ట పాడుకావడం వల్ల అసలే పనికి రాకుండా పోతున్నా ఆ చెరువులోకి నీళ్లు చేరవేసే ఒర్రెలు వాటర్‌షెడ్లలో భాగమైపోవడం వల్ల అసలే అందులోకి నీళ్లు రావడం లేదన్న ఫిర్యాదు ఉంది.

చెరువు ఆయకట్టులో ఉన్న రైతులు ఖర్చులేకుండా సాగునీరు పొందగలరు. బావులు ఖర్చుతో కూడుకున్న పని. నిజానికి బోర్లు వచ్చిన తర్వాత బావులనేవి కేవలం అలంకారప్రాయమే కాబట్టి భూగర్భ జలాలు ఉపయోగించుకోవాలంటే బోర్లు వేసుకోవాలి. మోటార్లు పెట్టుకోవాలి. పెరుగుతున్న కరెంట్ ఛార్జీలు కట్టుకోవాలి. కార్పొరేట్ వ్యవసాయం రంగప్రవేశం చేసిన తర్వాత వాళ్లు వేసినంత లోతుగా వేరెవరూ బోర్లు వేయలేరు కాబట్టి భూగర్భ జలాలన్నీ వారివే. కరెంట్ ఉత్పత్తికయ్యే ఖర్చు మొత్తం వినియోగదార్లే పెట్టుకోవాలనే ప్రపంచబ్యాంకు నియమాన్ని మన పాలకులు మొట్టమొదటగా అమలు చేస్తున్నారు కాబట్టి కార్పొరేషన్లు, వారి కనుసన్నలలో వ్యవసాయం చేసే ధనిక రైతులు తప్ప వేరే ఎవరూ బోర్లు వేసుకునే స్థితిలో —భూగర్భ జలాశయాలలోని నీటిని వ్యవసాయంకోసం వాడుకునే స్థితిలో —ఉండబోరు. చెరువుల వ్యవస్థను పునరుద్ధరించి, దానికి పోటీగానో, ప్రత్యామ్నాయంగానో కాక అనుబంధంగా భూగర్భ జలసంరక్షణ చేపట్టి, లోతయిన బోర్లు ఎవ్వరూ వేయడానికి వీలులేదన్న చట్టం చేసినట్లయితే చాలా భిన్నమైన సామాజిక చిత్రం కనిపిస్తుంది. అయితే అందులో 'విజన్—2020' నమూనా ఆధునీకరణకు చోటు అంతగా ఉండకపోవచ్చు.

